ఐతా చంద్రయ్య

'మీరు దినపత్రిక చదువుతారా సార్?'

తెల్లవారగానే పొద్దు బారెడెక్కిందో లేదో - తలుపు తట్టి ఇంట్లోకొచ్చి అడిగాడో యువకుడు. ఆ యువకుడ్ని ఎగాదిగా చూస్తూ జవాబు కోసం తటపటాయిస్తున్నాడు మల్లేశం.

'మీకు దినపత్రిక చదివే అలవాటుందా సార్?' హుషారుగా అడిగాడా యువకుడు మళ్ళీ.

ఈ వ్యక్తిని నెక్కడా చూసినట్లు లేదే!

'పత్రిక చదవకపోతే ప్రపంచమెట్లా తెలుస్తుందీ? ఈ రోజుల్లో... ఈ సిద్దిపేట లాంటి మహా పట్టణాల్లో పక్కనున్న ప్రశాంతి నగర్‌లో ఏం జరుగుతుందో గణేశ్ నగర్ వాళ్ళకు తెలియాలంటే దినపత్రికనే దిక్కు గదా!'

'కరెక్ట్ సార్! ఈ యాంత్రిక యుగంలో దినపత్రిక ప్రాధాన్యత చాలా పెరిగింది గదా. ప్లీజ్ కూచోండి సార్' చాకులాంటి యువకుడు చలాకీగా నవ్వుతూ పక్కనున్న కుర్చీలో కూర్చున్నాడు. ఆశ్చర్యం... అనూహ్యం.

ముక్కూ మొహం తెలీని వ్యక్తి నా ఇంట్లోకొచ్చి, నా కుర్చీలో కూర్చుని... నాకు మర్యాదిస్తున్నాడే! భేష్! మంచి కుర్రాడే!

వికసించిన మల్లేశం ముఖారవిందాన్ని శ్రద్ధగా చదివేస్తూ

'ప్లీజ్ కూచోండి సార్!' అన్నాడా యువకుడు మళ్ళీ.

'సరే... చెప్పండి, మీరెవరూ?'

తానో దినపత్రిక ప్రమోటర్నని, ఆ పత్రిక ప్రత్యేకతలన్నీ ఏకధాటిగా ఏకరువు పెట్టాడు.

అబ్బో! పిట్టకొంచెం, కూత ఘనం లాగుందే!

'రోజూ నేనదే పత్రిక చదువుతానండీ!'

'మరీ...' భృకుటి చిన్నగా ముడేసుకుంది. 'మీ ఇంట్లో పత్రిక కనపడ్డంలేదు...' చూపులు టీపాయ్ అంగాంగాన్ని తడిమాయి.

'ఆఫీసులో చదువుతానండీ' అనేశాడు మల్లేశం.

'విలువైన ఆఫీసు టైంను పత్రిక చదివేందు కుపయోగిస్తే... మరి నిద్రకెట్లానండీ?'

బాగానే వుంది జోకు. అది మల్లేశం పెదాల మీద చిరునవ్వు పూయించింది. 'ఇంకా మా ఆఫీసు అంత అభివృద్ధి సాధించలేదండీ'

'అయ్యో పాపం! పుట్టెడు ఫైళ్ళతో కుస్తీపడుతూ పత్రిక ఆసాంతం చదవగల్గుతున్నారా?'

'ఊహు... హెడ్‌లైన్స్...'

'ఆ... కరెక్ట్! నిజానికి మీలాంటి సిన్సియర్ ఉద్యోగికి ఆఫీసులో పేపర్ చదవాలంటే మనసొప్పదు. ఒప్పినా టైం దొరికి చావదు'

హమ్మయ్య! నా సిన్సియారిటీని గుర్తించే మనిషొకడున్నాడన్నమాట తృప్తిగా నిట్టూర్చాడు.

నిజమే... పత్రిక ఇలా చేతిలో కొస్తుందో లేదో అలా అర్జంట్ ఫైల్ ముందుకొస్తుంది. రెండు వాక్యాలు చదువుతానో లేదో ఇద్దరు ముగ్గురొచ్చి తమ ఫైల్ గురించి పట్టుబడ్తారు.

శ్రీమతి మల్లేశం చెరో టీ కప్పు అందించింది.

'థాంక్యూ సిస్టర్! అహా... ఆ బొట్టూ, కాటుక, కాళ్ళకు పారాణి... మహాలక్ష్మి లాగున్నారు'

'లాగ కాదు. ఆమె పేరే మహాలక్ష్మి' సిగ్గేసింది మల్లేశంకు.

భర్త సిగ్గులను ఓరకంటితో ఏరుకుంటూంటే మహాలక్ష్మి బుగ్గలు ఎర్రబారినై. నునుసిగ్గులు దోబూచులాడినై.

'అదే పత్రిక మీరు ఇంటికి తెప్పించుకున్నారనుకోండి...' ప్రమోటర్ విజృంభించాడు. 'హాయిగా ఇలా టీ తాగుతూ అలా అలా పత్రిక తిరగెయ్యొచ్చు. అన్ని పేజీలు హాయిగా చదివెయ్యొచ్చు. అసలూ... పత్రిక చదువుతున్నంతసేపూ మనం మరో లోకంలో విహరిస్తుంటాం. అదొక గొప్ప థ్రిల్లండీ బాబు'

'కరెక్ట్ బ్రదర్!' మహాలక్ష్మి అందుకుంది. తానూ ఓ టీ కప్పు ఖాళీ చేస్తూ భర్త కళ్ళల్లోకి చూసింది. 'మీరు ఆఫీసు కెళ్ళింతర్వాత నేను తీరిగ్గా చదువుకోవచ్చు. అదే పత్రికను సాయంత్రం బడి నుండి వచ్చి మన పిల్లలిద్దరూ చదువుకోవచ్చు'

'అన్నట్టూ మా పత్రికలో మహిళలకు, బాలలకు ప్రత్యేక పేజీలున్నాయి గదా!' ఫైల్లోంచి అప్లికేషన్ ఫారం తీసి మల్లేశం ముందుంచాడు. 'ఇక్కడో సంతకం చెయ్యండి సార్!'

ఫారం నింపి సంతకం చేశాడు.

★ ★ ★

'పేపర్... పేపర్ సార్!' మర్నాడుదయం పేపర్ కుర్రాడు తలుపు తట్టాడు.

'అబ్బా! కమ్మని నిద్ర పాడైపోయింది' కళ్ళు నులుము కుంటూ తలుపు తెరిచాడు మల్లేశం. చీకటి ఛాయలు మాయం కాలేదింకా.

పల్లెటూళ్ళో కోడిలాగ పట్నంలో పేపర్ కుర్రాడు.

'రోజు గిట్లనే లేపుమంటరా సార్!' పత్రిక అందిస్తూ అడిగాడు. బంగారం లాంటి నిద్రకు రోజూ భంగపాటెందుకూ?

'ఊహు! అదో ఆ కిటికీలో ఉంచి వెళ్ళిపో' కిటికీ చువ్వలు చూపించాడు.

కాలకృత్యాలు ముగించి టీపాయ్ మీది పత్రిక అందుకున్నాడు. కళ్ళు అక్షరాల వెంట పరుగెత్తుతున్నై. వార్త వెంట వార్త. చదువుతూ పోతూంటే... అదో దివ్యానుభూతి. కాలమెట్లా గడుస్తుందో తెలీలేదు. కుర్చీలోంచి లేవలేదు.

ఇంటికి పత్రిక తెప్పిస్తే... ఇంత సుఖంగా ఉంటుందా!

'మీరు పత్రిక తెప్పిస్తున్నారా సార్?' ఇంటి ముందాయన మందహాసం.

'అవునండీ...' తల గర్వంగా పైకి లేచింది.

ఉదయం నిద్రలేవగానే కిటికీలోంచి పత్రిక తీసుకోవడం, కాలకృత్యాలు తీర్చుకుని కాలుమీద కాలేసుకుని టీ సేవిస్తూ చదవడం... ఆ తర్వాత ఇంటి ముందాయనొచ్చి పత్రిక పట్టుకెళ్ళడం. మల్లేశంకు సరదాగానే ఉంది గాని మహాలక్ష్మికి తృప్తిగా లేదు. పనులన్నీ ముగిశాక పత్రిక కోసం ఇల్లిల్లూ తిరగాలి.

'మా పత్రిక మీ దగ్గరుందా?' నోరుతెరిచి అడగాలి.

ఇప్పుడే ఇంటిపక్కవాళ్ళు తీసుకెళ్ళారనో, ఇదో ఈ పేజీ చదవగానే ఇచ్చేస్తాననో మరేదో సమాధానమొస్తుంది. బయటికెళ్ళిన పేజీలన్నీ తిరిగి రావు. ముక్కలై ఎక్కువగానో, చినిగి తక్కువగానో వస్తాయి.

పుస్తకం వనితావిత్తం పరహస్తం గతం గతః



అథవా పునర్వ్యాయాతి జీర్ణం, భ్రష్టా చఖండశః... అన్నారు గదా. పుస్తకం కేటగిరీలోకి పత్రిక గూడా వస్తుందాయె.

వెతగ్గా వెతగ్గా పత్రిక చేతికొచ్చి అరగంటవుతుందో లేదో మరెవరో వచ్చి పట్టుకెళ్తారు. సాయంత్రం పిల్లలు చదవాలంటే మరోసారి సర్వేచేసి పట్టుకోవాలి.

సమస్యలన్నీ మల్లేశం ముందుంచింది మహాలక్ష్మి.

'అష్టరాల్ పత్రిక కోసం ఇరుగుపొరుగు వారితో తగాదా పెట్టుకోలేం గదా!' అనేశాడు అలవోకగా.

మరో రోజు ఉదయం కిటికీలో పత్రిక లేదు. పాపం! పేపర్ కుర్రాడు మర్చిపోయుంటాడు. చేతిలో పత్రిక లేకపోయేసరికి... ఏదో పోగొట్టుకున్నట్టుంది.

మర్నాడదే తంతు. కుర్రాడు మళ్ళీ మరిచాడా!

గబగబా చౌరస్తా కెళ్ళి మరో పత్రిక కొనుక్కొచ్చుకున్నాడు. సాయంత్రం ఆఫీసు నుండి వచ్చేప్పుడు పేపర్ ఏజెంటును కలిశాడు. కుర్రాడక్కడే వున్నాడు.

'నాకు పత్రిక పంపించడం లేదెందుకూ?' అడిగాడు.

'అయ్యో... రోజూ పంపిస్తున్నానే. ఏరా! సార్‌కు పత్రిక వెయ్యడంలేదా?' కుర్రాడినడిగాడు ఏజెంటు.

'వేస్తున్నాను. రోజట్లాగే కిటికీలో ఉంచేస్తున్నాను సార్. ఉసూరుమంటూ ఇంటికొచ్చాడు.

ఇంటి ముందు వాళ్ళబ్బాయి రెండ్రోజులు పత్రికలిచ్చి

'పొద్దున మీరు నిద్ర లేవట్లేదు గదా. అందాకా చదువుదామని తీసుకున్నాం మామయ్యా' తుర్రుమన్నాడు.

మొదట ఉలిక్కిపడి ఆ తర్వాత అవాక్కయ్యాడు.

'పత్రిక తెప్పించి ఏం లాభమండీ?' ముక్కుమీద వేలేసు కుంది మహాలక్ష్మి.

'ఛీ... ఏమన్నా అందామంటే... వాళ్ళేమనుకుంటారో!'

'నిజమే... కానీ రోజూ ఇలాగైతే ఎలా? ఏదన్నా ఉపాయ మాలోచించాలి గదా!' పక్కకొచ్చి కూచుంది.

'కరణేశు మంత్రివి గదా... మాంచి సలహా పారెయ్'

కాస్సేపు నెత్తి గోక్కుంటూ మరి కాస్సేపు చేతులు నలుపు కుంటూ ఆలోచించింది.

'ఆ... పత్రిక వద్దని చెప్పెయ్యండి'

'బోడి సలహా!' అరికాలు మంట నెత్తికెక్కింది.

'ఆ మాత్రానికే అంత సీను క్రియేట్ చెయ్యాలా?'

'అయ్యో... వద్దంటే పత్రిక ఇంటికి వద్దని చెప్పండి. మీరు ఆఫీసు కెళ్ళేప్పుడు ఏజెంటు దగ్గరే తీసుకుని బస్సులో చదువు కోండి. మీరు ఆఫీసు నుంచి వచ్చాక మేం చదువుకుంటాం'

ఇదేదో బాగానే ఉందే. లోకల్ బస్సెక్కి దిగేలోగా చదివి పారెయ్యొచ్చు.

కరణేశు మంత్రి సలహా కార్యరూపం ధరించింది. ఆఫీసు కెళ్ళేప్పుడు పేపర్ స్టాల్ దగ్గర పత్రిక తానే తీసుకున్నాడు. బస్సులో పత్రికా పఠనం సాగింది. చివరిస్టేజీ వచ్చేలోగా... చివరి పేజీ కొచ్చింది. సాయంత్రం తిరిగి వచ్చేప్పుడు... సంపా దకీయం కూడా చదివేశాడు. ఇంటికి రాగానే పిల్లలందుకు న్నారు. బస్సులో నుంచుండి కూడా పత్రిక చదవొచ్చనేది ప్రాక్టి కల్‌గా తెలిసిపోయింది.

మర్నాడు... బస్సులో పత్రిక విప్పాడు ఖుషీగా.

'ప్లీజ్... ఓ పేజీ ఇవ్వండి సార్!' పక్క సీటాయన చిరు హాసం చిందిస్తూ సగం పేజీలు లాక్కున్నాడు. మిగతా సగం పేజీలు చదివి...

'ఏదండీ... నా పత్రిక ఇవ్వండి' అడిగాడు.

'ఏం పత్రికా? పెళ్ళి పత్రికనా?' గుర్రుమన్నాడు పక్కా యన.

అయన... ఆయన కాదు. ప్రయాణీకుడు మారిపో యాడు.

'ఇక్కడున్నాయన నా పేపర్ తీసుకున్నాడు' ఆవేదన.

'ఆయన పోయిన స్టేజిలనే దిగిండు'

రోజూ అలాగే అవుతూంది. పత్రికతో బస్సెక్కగానే తోటి ప్రయాణీకులు తలా ఓ పేజీ లాక్కుంటారు. ఆ పేజీలు రొటే షన్ పద్ధతిలో మార్చుకుంటూ అంతా చదివి వేస్తున్నారు. బస్సు ఎక్కేప్పుడు ఫుల్‌పేజీతో... ఏనుగులాగున్న పత్రిక దిగేప్పుడు పీనుగులా మిగుల్తోంది.

ఇవ్వనంటే... వాడి చూపులు, వేడి నిట్టూర్పులు. ఇస్తే... ఇంతే సంగతులు... అదృష్టం బాగుంటే కొన్ని పేజీలన్నా మిగు ల్తున్నాయి.

రాత్రి పిల్లలు నిద్రబోయాక భార్యాభర్తల సమాలోచన సాగింది. బుర్ర చించి ఆలోచించి సమస్యను సాకల్యంగా చర్చి స్తున్నారు. మల్లేశం బుర్రలో మెరుపు...

'పోనీ... మనం కూడా పత్రిక కొనడం మానేస్తేనో...' అసలు సిసలైన పరిష్కారం దొరికినట్టు ఫోజిచ్చాడు.

'ఛీ...' ముద్దమందారం లాంటి మహాలక్ష్మి మొహం వాడిన గులాబీ లాగైంది. 'ఎలుకల బాధ భరించలేక ఇల్లు తగులబెట్టుకుంటామా? అందరూ అట్లానే ఆలోచిస్తే పత్రి కలూ, ప్రజాస్వామ్యం బతికి బట్టకడ్తాయా? ఆధునిక యుగంలో పత్రికలు లేకపోతే ప్రపంచం తలకిందులై పోతుంది గదా!'

'మరెట్లా... ఏం చేద్దాం?' జుట్టు పీక్కోవాలన్పించింది. షర్టు చించుకోబోతే మహాలక్ష్మి ఆపేసింది.

తర్జనభర్జన సాగింది. అర్ధరాత్రి తరుణోదయమైంది. పరి ష్కారం ఫార్ములా పాసైపోయింది.

మర్నాడు ఏజెంటుకు చెప్పాడు - పత్రిక ఇంటికే పంప మని.

ఉదయం... చీకటి కాకులు రెక్కలు విప్పుతున్నాయి. ఇంట్లో అలారం గడియారం గొంతెత్తి అరిచింది. మల్లేశం నిద్ర మత్తు వదిలింది.పత్రిక స్వయంగా అందుకున్నాడు. తానే వెళ్ళి పాలపాకెట్లు తెచ్చుకున్నాడు. కూలి డబ్బులిచ్చి పాల పాకెట్లు ఇంటికి తెప్పించుకునే పద్ధతి ఆ రోజు నుండే ఆగిపోయింది.

స్నానాదులు ముగించి కాలు మీద కాలేసుకుని కుర్చీలో కూచున్నాడు. పూజ ముగించుకున్న మహాలక్ష్మి టీ కప్పు అందించింది. టీ సేవనంతోపాటు పత్రికా పఠనం సజావుగా సాగిపోతోంది. ఆహా! నందన వనంలో విహరిస్తున్నట్టుంది.

ఆ దృశ్యం ఇంటి ముందాయన దృష్టిలో పడింది. వెంటనే వాళ్ళబ్బాయిని పురమాయించాడు.

'మావయ్యా! మా నాన్న పేపర్ తీసుకురమ్మన్నడు'

'ఇవ్వనని చెప్పు ఫో!' గొంతులో గాంభీర్యం.

అరగంట గడిచింది.

ఇంటి పక్కాయన స్వయంగా వచ్చేశాడు.

'ఏం సార్! టీ తాగడం అయిందా?' నల్లని పెదాల మీద తెల్లని నవ్వు.

'అవుతోంది!' పత్రికలోంచి తలెత్తలేదు.

'ప్రజాస్వామ్యానికి పత్రికలు పట్టుగొమ్మలు గదా సార్. ఇహ మీరో టెలిఫోన్ పెట్టించుకుంటే బ్రహ్మాండంగా ఉంటుంది సార్' ఎదురుకుర్చీ నాక్రమించాడు. మల్లేశం ఓరకంటితో చూశాడు.

'పెట్టించుకుంటా గాని... దాన్ని నేనే ఉపయోగించు కుంటా. ఇతరులెవ్వరూ వాడుకోవడానికి వీల్లేదు' పైకి అనే శాడు.

'అంటే... ఇరుగూ పొరుగూ...'

'మా ఇరుగు పొరుగు వాళ్ళు చిల్లర వెధవాయలు కారు. వాళ్ళు ఇతరుల ఫోన్ మీద ఆధారపడి లేరు'

అమాయక చక్రవర్తి అనుకున్న మల్లేశం మాయాబజార్లో ఘటోత్కజుడయాడేమిటీ.

'అయితే... పత్రిక కూడా...'

'అవును పత్రిక కూడా ఎవ్వరికీవ్వొద్దని నిర్ణయించు కున్నాం' నవ్వుతూ కళ్ళల్లోకి చూశాడు.

'ఎంతైనా... ఇరుగు పొరుగు వాళ్ళమన్నప్పుడు ఆ మాత్రం కోఆపరేషన్...'

'ఉండి తీరాలి... కాని మన కోఆపరేషన్ కార్పొరేషన్‌గా మారగూడదు.

'అంటే...'

'ప్రజాస్వామ్యానికి పత్రికలు పట్టుగొమ్మలు కదా! రేప ట్నుంచి మీ ఇంట్లో పత్రిక వెయ్యమని ఈ రోజే ఏజెంటుకు చెబుతున్నా. పత్రికలు నిలదొక్కుకోవాలంటే మనం కొని చదవా లని మీరొప్పుకుంటారు...'

అస్త్రం ఎదురు తిరిగింది అయిష్టంగా లేచి భారంగా అడుగులేస్తున్నాడు ఇంటి పక్కాయన.

'అన్నట్టూ... మనింటి ముందాయనతో దినపత్రిక కొని పించే బాధ్యత మీదే. పట్టుగొమ్మల్ని పట్టుబట్టి పెంచుకోవడం మన కర్తవ్యం గదా'

అప్పటికే ఆయన గడప దాటాడు.

మహాలక్ష్మి అంతా చూసింది. ఆమె ఆనందానికి అవధు ల్లేవు. 'హమ్మయ్య! మావారు మామూలు మల్లేశం కాదని నిరూ పించుకున్నారు...' గలగలా నవ్వేసింది. ఆగలేక వచ్చి అమాంతం... ★